బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 09 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## హైదరాబాద్‌లో బాంబు బెదిరింపుల కలకలం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్టు మంగళవారం బెదిరింపు మెయిల్స్ రావడంతో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. రాజ్‌భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబులు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టులో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశారు. పోలీస్ బలగాలు న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని బయటకు పంపగా డాగ్ స్క్వాడ్, బాంబు స్కాడ్, క్లూస్ టీమ్‌లోనికి వెళ్లి ప్రధాన భవనంతోపాటు ప్రాంగణంలోని అన్ని భవనాలనూ తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇతర చోట్ల కూడా ఏమీ దొరకలేదు. దాంతో అవి ఫేక్ మెయిల్స్ అని పోలీసులు తేల్చారు. అన్నా వర్సిటీ పూర్వ విద్యార్థుల పేరుతో మంగళవారం తెల్లవారుజామున 3.43 గంటల సమయంలో ఆగంతకుడు మెయిల్ పంపినట్టు గుర్తించారు. నగరం సేఫ్‌గా ఉందని, వదంతులను నమ్మొద్దని పోలీసులు సూచించారు.

# రాష్ట్రానికి యూరియా సరఫరా పెంచాలి



- జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి సహకరించండి
- వరంగల్ విమానాశ్రయానికి ఆర్థికసాయం చేయండి
- హైదరాబాద్‌బెంగళూరు ఏరో డిఫెన్స్ కారిడార్ ఇవ్వండి
- కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పీయూశ్ గోయల్ లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మంగళవారం కేంద్రమంత్రిని ఆయన అధికారిక నివాసంలో కలిశారు. వర్షాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్–జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావల్సి ఉండగా, కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడంతో సాగు పనులు ప్రారంభమయ్యాయనీ, యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారని వివరించారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలనికోరారు. యూరియా సరఫరా కోసం రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదనీ, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**కేంద్రమంత్రి పీయూశ్ గోయల్‌తో భేటీ**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. దీనికోసం జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్ ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని పేర్కొంటూ



వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్ సాధ్యాసాధ్యాల అధ్యయనం చేస్తున్నామని కేంద్రమంత్రికి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందనీ, అందువల్ల హైదరాబాద్–బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధి ప్రతిపాదనలు ఇస్తామనీ, ఇక్కడ వందకు పైగా కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కేంద్రమంత్రుల్ని కలిసిన బృందంలో సీఎంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఉన్నారు.

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రిగా కే చంద్రశేఖర్ రాణించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రధాన మంత్రులుగా ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకునిగా పలు విధాన నిర్ణయాల్లో చంద్రశేఖర్ ప్రభుత్వానికి అండగా నిలిచారని చెప్పారు.

## రచ్చ చేయడమేనా...
# చర్చించడం రాదా సీఎం



- సవాలు విసిరి పారిపోయిన సీఎం
- మరో అవకాశమిస్తున్నా...చర్చకు రావాలి
- లేకపోతే క్షమాపణ చెప్పాలి
- ఎరువుల కొరత, బోనస్ రాకతో రైతులు నష్టపోతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రచ్చ చేయడమే తప్ప చర్చించడం సీఎం రేవంత్ రెడ్డికి తెలియదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువతకు ఎవరేం చేశారో చర్చించాలంటూ సవాల్ విసిరిన ముఖ్యమంత్రి ఢిల్లీ పారిపోయారని ఎద్దేవా చేశారు. మరోసారి అవకాశమిస్తున్నాననీ, సమయం, స్థలం, తేదీ వారే నిర్ణయించి చర్చకు సిద్ధం కావాలని అన్నారు. చర్చించేందుకు సిద్ధంగా లేకుంటే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బూతులు మాట్లాడటమే తప్ప రైతుల గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడటం రాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. వందలాది మంది అనుచరులు ఆయనను అనుసరించడంతో క్లబ్ గులాబీ శ్రేణులతో నిండిపోయింది. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి అని రాసి ఉన్న ఖాళీ కుర్చీని వేదికపై ఉంచారు. ఆ పక్క కుర్చీలో కేటీఆర్ కూర్చున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం ప్రకటిస్తూ బీఆర్ఎస్ నేతలు ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంపై చర్చకు సవాల్ విసిరిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పారిపోయారని ఆరోపించారు. రైతుల సమస్యలపై తాము సమగ్ర సమాచారం సేకరించి సిద్ధంగా ఉన్నామని, ముఖ్యమంత్రి కంటే తాము ఎక్కువ ఆధారాలతో వేదికపైకు వచ్చామని చెప్పారు. "రైతుభరోసా అమలులో లోపాలపై రుజువులతో వచ్చాం. కానీ రేవంత్ గారు మాత్రం గైర్హాజరయ్యారు. చర్చకు రావాల్సిన వారు పారిపోయినదాన్ని ప్రజలు గమనిస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పాలన ప్రారంభమైన నాటి నుంచి ఆత్మహత్య చేసుకున్న 600 మంది అన్నదాతలకు నివాళిగా బీఆర్ఎస్ నేతలు ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ "తెలంగాణ రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఎరువుల కొరత, బోనస్ రాకతో రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ 18 నెలలుగా రైతులను దగా చేస్తోంది" అని విమర్శించారు. "బేసిక్ నాలెడ్జ్ లేని సీఎంకు ప్రిపరేషన్ టైమ్‌గా 72 గంటలు ఇచ్చాం. ప్లేస్, టైం కూడా మేమే డిసైడ్ చేసి పబ్లిక్ వేదికపై చర్చకు సిద్ధమయ్యాం. అయినా ఆయన రాలేదు. అసలు చర్చే చేయలేని స్థితిలో ఉన్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు.

**రైతులకు దగా.. నీళ్లు ఏపీకి, నిధులు ఢిల్లీకి**

తెలంగాణ నీటిని ఆంధ్రకు

మిగితా 2వ పేజీలో

# బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు



- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మహబూబాబాద్ జిల్లాలో రోడ్లు, సబ్‌స్టేషన్ నిర్మాణాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో రోడ్లు, సబ్‌స్టేషన్ నిర్మాణాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కేసముద్రం మండల కేంద్రంలో సుమారు రూ.400కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అంతకుముందు సోమలతండాలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. బీఆర్ఎస్ 10ఏండ్లలో లక్ష కోట్ల నుంచి రూ.2లక్షల కోట్ల వరకు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పట్టుమని పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. వాటిని కప్పిపుచ్చుకునేందుకు అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ కార్యక్రమాలు చేరవేసుకుంటూ ముందుకు పోతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు అనవసరంగా ఎక్కువగా ఊహించుకొని సీఎం రేవంత్ రెడ్డిపై అవాకులు చవాకులు పేల్చొద్దని సూచించారు.

బేసిన్‌ల గురించి తెలియదంటూ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, కానీ, కృష్ణ, గోదావరి బేసిన్ జలాల గురించి ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన విషయం గుర్తు చేసుకోవాలని భట్టి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జలాల విషయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆధారాలతో సహా చూపించారని తెలిపారు. కృష్ణ, గోదావరికి బేసిన్ ప్రాజెక్టుల్లో నీళ్ల గురించి లెక్కలతో సహా శాసనసభలో చర్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పెద్ద మనిషి కేసీఆర్ కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ సవాల్‌ను స్వీకరించకుండా మరొకరు ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ అంటే ఎట్లా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉండగా, ఈ సంవత్సరం మార్చిలో అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ వచ్చిందని

మిగితా 2వ పేజీలో




## 14 దేశాలపై భారీ సుంకాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమెరికా వాణిజ్య భాగస్వాములపై దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచారు. ఆగస్ట్ 1వ తేదీ నుంచి వర్తించే నూతన టారిఫ్ రేట్లపై దక్షిణాఫ్రికా, మలేసియా సహా 14 దేశాల అధినేతలకు ఆయన తన సంతకంతో లేఖలు పంపారు. అయితే 'ప్రతీకార' సుంకాల అమలుకు గతంలో ప్రకటించిన గడువును ఆగస్ట్ 1వ తేదీ వరకూ పొడిగించారు. కానీ చైనాకు ఈ వెసులుబాటు కల్పించకపోవడం గమనార్హం. వాస్తవానికి వాణిజ్య భాగస్వాములపై విధించిన ప్రతీకార సుంకాలు బుధవారం నుంచి అమలులోకి రావాల్సి ఉంది. ప్రతీకార టారిఫ్ రేట్లు ఏప్రిల్‌లో ప్రకటించిన వాటి కంటే ఎక్కువగానో లేదా తక్కువగానో ఉండవచ్చునని వివిధ దేశాలకు పంపిన లేఖలలో ట్రంప్ తెలియజేశారు. దాదాపుగా వాణిజ్య భాగస్వాములందరి పైన పది శాతం బేస్ టారిఫ్, 50 శాతం వరకూ గరిష్ట సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ఏప్రిల్ 2న ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాను విధించిన దిగుమతి సుంకాల అమలుకు ట్రంప్ 90 రోజుల విరామం ప్రకటిం చారు. ఆ గడువు బుధవారం ముగుస్తుంది. ఇప్పుడు తాజాగా ఆ గడువును ఆగస్ట్ 1వ తేదీ వరకూ పొడిగించారు. ట్రంప్ నుంచి ముందుగా లేఖలు అందుకున్న వారిలో జపాన్ ప్రధాని షిజెరు ఇష్బిబా, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే–మియుంగ్ ఉన్నారు. జపాన్, దక్షిణ కొరియా దేశాల నుంచి అమెరికాలో ప్రవేశించే ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత మలేసియా, కజక్‌స్థాన్, దక్షిణాఫ్రికా, మయన్మార్, లావోస్ దేశాల నేతలు కూడా లేఖలు అందుకు న్నారు. ఆయా దేశాలపై 40 శాతం వరకూ సుంకం విధించారు. మూడో విడతలో తునీసియా, బోస్నియా, హెర్జెగోవినా, ఇండోనేషియా, బంగ్లాదేశ్, సెర్బియా, కాంబోడియా, థాయ్‌లాండ్ దేశాల నేతలకు లేఖలు అందాయి. అమెరికా వాణిజ్య లోటును ట్రంప్ తన లేఖలలో ప్రముఖంగా ప్రస్తావించారు. టారిఫ్ రేట్లు ఇతర విధానాలపై కూడా ఆధారపడి ఉంటాయని తెలిపారు.

## హైడ్రాపై బెంగళూరు ఇంజినీర్లు ప్రశంసలు

**చెరువుల పరిరక్షణలో హైడ్రా విధానం ఆదర్శంగా నిలుస్తోంది: కర్ణాటక ఇంజినీర్లు**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణలో హైడ్రా చేస్తున్న కృషి, నగరంలోని పలు చెరువుల అభివృద్ధి పనులను బెంగళూరుకు చెందిన లేక్స్ డిపార్ట్మెంట్ ఇంజినీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. చెరువుల పునరుద్ధరణలో ఉపయోగించిన మార్గాలను ప్రత్యక్షంగా వీక్షించి ప్రశంసలు కురిపించారు. పాతబస్తీలోని బమ్మృక్నుద్దౌలా చెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను సందర్శించిన ఇంజినీర్లు, ఆక్రమణలను తొలగించి తిరిగి జీవం పోసిన తీరును గుర్తించి హైడ్రాను అభినందించారు. ముల్లపొదలతో కప్పబడిన చెరువులను శుభ్రపరచడం, నీటి ప్రవాహాన్ని తిరిగి నెలకొల్పడం అభినందనీయమన్నారు.

బమ్మృక్నుద్దౌలా చెరువు దిగువ ఉన్న ఊటబావి నుంచి నిజాం నవాబులు తాగునీటిని వినియోగించారన్న చారిత్రక సమాచారం తెలుసుకుని ఇంజినీర్లు ఆశ్చర్యపోయారు. "ఇలాంటి చరిత్ర ఉన్న చెరువులను పునరుద్ధరించిన హైడ్రా పనితీరు మాదిరిగా దేశం మొత్తం పాటించాల్సిన విధానం" అని అభిప్రాయపడ్డారు.

**బతుకమ్మకుంట పేరు వెనక కథనంపై ఆసక్తి**

బతుకమ్మకుంట అనే పేరు ఎలా వచ్చిందన్న విషయాన్ని కూడా అధికారులు ఇంజినీర్లకు వివరించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ఎదురైన ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి జాడే లేకున్నా చెరువులను పునరుజ్జీవింపజేసిన తీరు నన్నే ఆకట్టుకుందన్నారు.

సందర్శన అనంతరం బెంగళూరుకు చెందిన చీఫ్ ఇంజినీర్ హరిదాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిత్య, భూప్రద, మహదేవ్ తదితరులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి అభినందించారు. బెంగళూరులో చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు. "2006 నుంచి చెరువులకు ఫెన్సింగ్ వేయడం ద్వారా కబ్జా సమస్యను అడ్డుకుంటున్నాం. నాలాల కబ్జాలతో వరదలు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని వెల్లడించారు.

ఈ సందర్భంగా రంగనాథ్ చెరువుల పునరుద్ధరణ సమయంలో బెంగళూరులో చేసిన సందర్శన ఫొటోలతో రూపొందించిన ఫ్రేమ్‌ను బహుమతిగా అందించారు. "హైడ్రా మాదిరి సంస్థలు అన్ని రాష్ట్రాలకూ అవసరం" అని బెంగళూరు ఇంజినీర్లు స్పష్టంగా చెప్పారు.

# భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి



- కబ్జాదారుల ఘాతుకం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సాక్షాత్తు రామయ్య భూములనే కబ్జా చేయాలని పథకం రచించి అమలుపరుస్తున్న పురుషోత్తపట్నంకు చెందిన కబ్జాదారులు ఆలయ భూముల రక్షణ కోసం వెళ్ళిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆలయ ఈఓ ఎల్.రమాదేవితో పాటు అర్చకులపైనా దాడి చేశారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పురుషోత్త పట్నంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చెందిన సుమారు 1500 ఎకరాల భూమి పురుషోత్తపట్నంలో ఉంది. అందులో 889.50 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారు. ఆ భూమిపై దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించగా 2022లోనే ఆ భూములు దేవస్థానానికి చెందినవని, ఆ భూమిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా యధాస్థితిలో దేవస్థానానికి అప్పజెప్పాలని ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఆ ఉత్తర్వులు అమలు చేసేందుకు స్థానిక పోలీసులు సహకరించని నేపథ్యంలో దేవస్థానం హైకోర్టులో పిటిషన్ వేసింది. అంతేకాకుండా సుమారు 250 పైగా వివిధ న్యాయస్థాన పరిధిలో కేసులు వేయగా అన్ని కేసుల్లో ఆయా భూములు దేవస్థానానికి చెందుతున్నాయని తీర్పులు ఇచ్చాయి. అయినా ఆక్రమణలు ఆగటం లేదు. ఈ దశలో సోమవారం దేవస్థానం అధికారులు దేవస్థానం భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాల వద్దకు వెళ్లారు. జరుగుతున్న పరిణామాలపై ఆలయ ఈవో మంగళవారం సిబ్బందితోపాటు అర్చక స్వాములను కలుపుకొని నిర్మాణాలు చేపట్టే వారితో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు ఎట్టపాక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న గారపాటి చంద్రశేఖర్, పంద అఖిల్ రెడ్డి, సార్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, భార్గవ్ మణికంఠ తదితరులు కొంతమంది స్థానికులను, తన ప్రధాన అనుచర గణాలను రెచ్చగొట్టి ఈవోతో పాటు సిబ్బందిపై భౌతిక దాడికి దిగారు. జరిగిన ఘర్షణలో ఆలయ ఈవో రమాదేవితో పాటు అర్చకులు, సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.

మిగితా 2వ పేజీలో

## వైఎస్ఆర్ పేరుతో అవార్డులు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ పేరుతో అభ్యుదయ రైతులకు అవార్డులు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వం ముందుంచిందని వెల్లడించారు. వైఎస్ఆర్ స్ఫూర్తిని కొనసాగించే లక్ష్యంతో ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, దాని ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని చూస్తున్నామని తెలిపారు. వచ్చే వర్ధంతి నాటికి వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి, అవార్డులు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించాలని భావిస్తున్నామని చెప్పారు.

వైఎస్ఆర్ అంటే రైతన్నకు ఒదిగిన నాయకుడని, ఆయన ప్రధానంగా వ్యవసాయానికే ప్రాధాన్యం ఇచ్చారని భట్టి పేర్కొన్నారు. "రెండు జీవనదుల్లో ప్రవహిస్తున్న నీటిని ప్రాజెక్టుల రూపంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందించిన యోధుడు వైఎస్ఆర్. ఆయన మానవ రూపం లేకపోయినా, ఆయన ఆలోచనలు, ప్రణాళికలు ప్రజల జీవితాల్లో నిలిచిపోతాయి," అని ఆయన వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్‌ను నిత్యం స్మరిస్తూ, ఆయన పరంపరను కొనసాగించేందుకు ప్రభుత్వం ఈ విధంగా ఒక అభ్యుదయ ప్రణాళికను రూపొందించుతోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# చర్చ అసెంబ్లీలోనే జరగాలి

- సోమాజిగూడ డ్రామాలు మానుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రైతు సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించి సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల మధ్య డ్రామాలు చేయడం కంటే ప్రజాస్వామ్యబద్ధంగా అసెంబ్లీలో చర్చ జరపాలని సూచించారు. రైతుల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్‌కు నిజంగా చర్చపై ఆసక్తి ఉంటే స్పీకర్‌కు లేఖ రాయాలని మంత్రి సూచించారు. "ప్రజాస్వామ్యంలో అసెంబ్లీనే చర్చలకు సరైన వేదిక. అక్కడ చర్చించిన ప్రతి మాట ఆన్ రికార్డులోకి వస్తుంది. భవిష్యత్ తరాలకు కూడా తెలుసు. ప్రెస్ క్లబ్ వేదికలు, స్టేజీ డ్రామాలు ప్రజలను మభ్యపెట్టలేవు," అని ఆయన స్పష్టం చేశారు.

ప్రజల మద్దతుతో కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు బీఆర్ఎస్ నేతలకు జీర్ణించలేకపోతున్నాయని, అందుకే ఇలా రచ్చ చేస్తున్నారని మంత్రి పొన్నం మండిపడ్డారు. రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "చర్చకు నిజంగా ధైర్యం ఉంటే అసెంబ్లీలోకి రండి" అంటూ మంత్రిపెద్దలు బీఆర్ఎస్‌ను సవాల్ చేశారు.

## జీపీ సిబ్బంది మూడు నెలల జీతాల చెల్లింపు

బలగం టీవీ, హైదరాబాద్

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన వేతనాలను మంగళవారం విడుదల చేసింది. దానికి సంబంధించి రూ.150 కోట్ల విడుదలకు ఆర్థిక శాఖ అనుమతులు జారీ చేసింది. బుధవారం గ్రామపంచాయతీ ఖాతాల్లో ఆ వేతనాలు జమకానున్నాయి. ఆ తర్వాత ఒకటెండ్రు రోజుల్లో మూడునెలల జీతాలను మల్టీ పర్పస్ కార్మికులు అందుకోనున్నారు. దీని వల్ల రాష్ట్రంలో పనిచేస్తున్న 53 వేల మంది మల్టీపర్పస్ ఉద్యోగులకు లబ్ది చేకూరనున్నది.

### రచ్చ చేయడమేనా...

## చర్చించడం రాదా సీఎం

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తున్నారని, బనకచర్ల, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల విషయాల్లో సీఎం మౌనం అత్యంత ప్రమాదకరమని కేటీఆర్ తెలిపారు. "నీళ్లు ఏపీకి, నిధులు ఢిల్లీకి పోతున్నాయి. నియామకాలు మాత్రం రేవంత్ రెడ్డి తొత్తులకు ఇస్తున్నాడు. ఇదే కాంగ్రెస్ పాలన" అని విమర్శించారు.

"అసెంబ్లీలోనైనా చర్చిద్దాం. కానీ మైక్ కట్ చేయొద్దు. గతంలో ఎన్ని సార్లు మాట్లాడే అవకాశాలు కట్ చేశారో ప్రజలు గమనించారు. ఇప్పటికైనా ముఖ్యం చర్చకే వేదిక కావాలి" అని స్పష్టంచేశారు. "ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్న తరువాత కూడా వ్యవసాయ విషయాల్లో ఆయనకు కనీస అవగాహన లేదు. బేసిన్ అంటే ఏంటో తెలియదు. ఇరిగేషన్ అధికారులను చిన్న పిల్లాడిలా ప్రశ్నిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. "ఇంకో అవకాశం ఇస్తున్నాను. చర్చకు స్థలం, సమయం, అంశాన్ని కూడా సీఎం రేవంత్ డిసైడ్ చేయొచ్చు. మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మన్నా వస్తాం. కానీ ఈసారి కూడా తప్పించుకుంటే%% కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

18 నెలలుగా 70 లక్షల మంది రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ దగా చేసిందని మండిపడ్డారు. హామీల అమలుకు గ్యారంటీ అంటూ నమ్మబలికి 18 నెలల తర్వాత కూడా ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. రైతుల గురించి కనీస పరిజ్ఞానం లేకుండా సీఎం మాట్లాడుతున్నారనీ, అందుకే సిద్ధపడేందుకు 72 గంటల సమయమిచ్చినట్టు తెలిపారు. స్థలం, సమయం, తేదీ ముఖ్యమంత్రి ఇష్టానికే వదిలేసినట్టు చెప్పారు. అటు నుంచి సమాధానం రాకపోవడంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం ఉదయం 11 గంటలకు తాము వస్తున్నామనీ, అక్కడే చర్చకు రావాలని కోరినట్టు తెలిపారు. సీఎం రాలేకపోయినా సరే... ఆయన పక్షాన ఉప ముఖ్యమంత్రి గానీ, వ్యవసాయశాఖ మంత్రి గానీ, లేకపోతే ఎవరైనా మంత్రులు వచ్చినా తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నీళ్లు, నియామకాలు, నిధులను తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. బనకర్లకు పచ్చజెండా ఊపుతూ, కృష్ణా నీటిని ఆంధ్రకు తరలిస్తే ఆయన కండ్లు మూసుకున్నారని మండిపడ్డారు. రైతుభరోసా, రైతు రుణమాఫీ దక్కని రైతుల జాబితాలు, ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు, బోనస్ రాక మిల్లర్లకు అమ్ముకుని నష్టపోయిన రైతుల జాబితాలతో తాను చర్చించేందుకు వచ్చినట్టు చెప్పారు. గత కాంగ్రెస్ పాలన నాటి రోజులను మళ్లీ తెచ్చారనీ, రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

మాట తప్పడం, పారిపోవడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2018లో కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ సొంతగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మరోసారి మాట తప్పి పారిపోయారని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టు పెడితే గజ గజ వణికిపోయే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించేందుకు కేసీఆర్ అవసరం లేదనీ, బీఆర్ఎస్‌లో ఏ నాయకుడైనా సరిపోతాడని అన్నారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## కల్తీ కల్లు తాగి 13 మందికి అస్వస్థత

బలగం టీవీ, హైదరాబాద్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో కల్తీ కల్లు కలకలం సృష్టించింది. వివరాల్లోకెళ్తే.. కూకట్‌పల్లి పరిధిలోని హైదర్‌నగర్, ఎల్లమ్మబండ, గోకుల్ ప్లాట్స్ ప్రాంతాలకు చెందిన కొందరు మంగళవారం ఓ కల్లు దుకాణంలో కల్లు తాగారు. అనంతరం కల్లు తాగిన 13 మంది వ్యక్తులు వాంతులు, విరోచనాలు, లో బీపీ సమస్యలతో స్థానిక రాందేవ్ ఆస్పత్రిలో చేరారు. వైద్య సిబ్బంది వారిని పరిశీలించి కల్లు తాగిన కారణంగా సమస్యలు వచ్చాయని గుర్తించి వెంటనే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆరోగ్య శాఖ, పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. చికిత్స పొందుతున్న వారిలో తొమ్మిది మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరి మాట్లాడుతూ అస్వస్థతకు గురైన వారందరినీ మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కి తరలించనున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారం పై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## ఈవోలపై దాడి చేస్తే కఠిన చర్యలు

- మంత్రి కొండా సురేఖ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేవుడి భూములు రక్షించే ఈవోలపై దాడి చేస్తే ఊరుకోబోమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. భద్రాచలం ఈవో రమాదేవిపై దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎక్కడైనా రూల్స్ విరుద్ధంగా ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడుతాం.. ఈ విషయంలో గతంలోనూ తాము స్పష్టం చేశామని గుర్తుచేశారు.భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకి గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై దాడి చేయడం సహేతుకం కాదన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని.. సమస్యను పరిష్కారం చేయాలని అభ్యర్థించారు.

# 42% బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి

- లేకపోతే జూలై 17న రైల్ రోకో
- ఎమ్మెల్సీ కవిత



బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ పార్లమెంట్?లో చట్టం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని జూలై 10న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే జూలై 17న రైల్‌రోకో నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

గత 18 నెలలుగా 42 శాతం రిజర్వేషన్ల కోసం వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నామని కవిత తెలిపారు. "ఫలితంగా రాష్ట్ర అసెంబ్లీలోనూ, కౌన్సిల్‌లోనూ బీసీ బిల్లుకు ఆమోదం లభించింది. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి వద్దకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే ఆమోదించాలి" అని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ బీసీ బిడ్డగా బీసీలకు న్యాయం చేసే చారిత్రక బాధ్యతను నెరవేర్చాలని కోరారు. రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం లభించకపోతే ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగృతి సంస్థ తరఫున ఎవరూ పోటీ చేయరని, పార్టీ గుర్తులతో బీఆర్ఎస్ మాత్రమే బరిలో ఉండనుందని చెప్పారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వీప్ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రైల్‌రోకోకు మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలకు లేఖలు పంపుతున్నామని, ఢిల్లీలో ఈ పోరాటం పూర్తిగా రిజర్వేషన్ల కోసం మాత్రమేనని స్పష్టంచేశారు.

# బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఇంత డిమాండ్ వచ్చినప్పటికీ రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్తు సేవలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు డ్వాక్రా మహిళలకు ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించి మొదటి సంవత్సరంలో రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని అన్నారు. ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. పోడు రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్పు, అవకాడో, వెదురు వంటి మొక్కలు ఉచితంగా అందించేందుకు రూ.12,600కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

# భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

వారిని భద్రాచలం పట్టణ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్యాన్ని అందిస్తు న్నారు. దేవస్థాన అధికారులపై దాడి జరుగుతుందని సమాచారం ఉన్న ఎట్టపాక పోలీసులు స్పందించ లేదు. కేవలం ఇద్దరు సాధారణ కానిస్టేబుళ్లను మాత్రమే పంపించారని, వచ్చిన కానిస్టేబుల్స్ సైతం ప్రేక్షక పాత్ర వహించారే తప్ప దాడిని నియంత్రించేందుకు ఏమాత్రం ముందుకు రాలేదని దేవస్థానం ఉద్యోగులు ఆరోపిస్తూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో తమ నిరసన తెలిపారు. సరిహద్దు వివాదాన్ని ఆసరాగా తీసుకొని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మహిళా ఉద్యోగిపై దాడి చేసినా ఏపీ ప్రభుత్వ అధికారులు గానీ, పోలీస్ సిబ్బంది గానీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రామనామ జపం చేసే బీజేపీ నేతృత్వంలో ఉన్న కూటమి సర్కార్ రామయ్య భూములను రక్షిస్తుందో.. కబ్జాదారులకు అండగా నిలుస్తుందో వేచి చూడాలి.

ఆలయ ఈవో రమాదేవితో పాటు సిబ్బంది అర్చక స్వాములపై ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆ సంఘం అధ్యక్షకార్యదర్శులు డెక్క నరసింహారావు, గుగిరి బాలకృష్ణ నవతెలంగాణతో మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడి హేయమైన చర్య అని అన్నారు. దేవస్థాన భూములను రక్షించాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కబ్జాలను అడ్డుకున్న అధికారులపై దాడులు చేస్తే ఉద్యోగ సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు.

## ఆదివాసీ బిడ్డ జోలికి రావాలి

- మంత్రి సీతక్క



బలగం టీవీ, హైదరాబాద్

"మేం సమ్మక్క, సారలమ్మ వారసులం.. ఆదివాసీ బిడ్డ జోలికి వస్తే నాశనమైపోతావ్ కేటీఆర్" అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు నియోజకవర్గంలో నిజాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదని హెచ్చరించారు. ములుగులో ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన సాగుతోందన్నారు. కేటీఆర్ దొర అహంకారం తగ్గించుకోవాలని, కుల, ధన బలం ఉండొచ్చని, కానీ తనకి నియోజకవర్గ ప్రజల బలముందని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలు, ఇచ్చిన ఇండ్లు ఎన్నో లెక్క చూసుకొని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ మిడుతల దండుతో ములుగుపై పడ్డాడని, ఓడిపోయిన నాయకులు ములుగు వచ్చి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చనిపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించని వారు రోడ్లపై డ్రామాలు చేయడం సిగ్గు చేటని అన్నారు. పోలీసులు శాంతియుత ధర్నాకు అనుమతిస్తే కాన్వాయ్‌ని అడ్డుకోవాలని కుట్ర చేశారని అన్నారు. జులై 6 వరకు బీఆర్ఎస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్ని, మీ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్నో తెలపాలన్నారు. దుబాయ్ వేదికగా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న అబద్ధాలను మానుకోవాలని హితవు పలికారు. ములుగు నియోజకవర్గంలో సీడ్‌తో నష్టపోయిన 950మందికి కంపెనీల ప్రతినిధులతో రూ.4కోట్లు ఇప్పించేందుకు మంత్రి తుమ్మల, తాను వెళ్తుంటే అడ్డుకోవాలని చూశారని ఆరోపించారు. బుట్టాయిగూడెం, చల్వాయిలో చనిపోయిన వారు ఎందుకు చనిపోయారో ముందు కారణాలు తెలుసుకోవాలని అన్నారు. సిరిసిల్లలో ఇసుక లారీలతో తొక్కించి చంపింది, అడ్వకేట్లను చంపింది ఎవరో తెలియదా అని ప్రశ్నించారు. 70ఏండ్ల చరిత్రలో పంచాయతీరాజ్ శాఖకు ఒక కోయ ఆడబిడ్డ మంత్రిగా ఉంటే అక్కసు వెళ్లగక్కుతున్నారనీ, తనకు ఒక్క అవకాశం వస్తే ఓర్చుకోలేవా కేటీఆర్ అని అన్నారు. ఎన్నికల కోసం డ్రామాలడటం బీఆర్ఎస్‌కు తగదని తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మేన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## భారత నర్సుకు జులై 16న యెమెన్ లో మరణశిక్ష

బలగం టీవీ, హైదరాబాద్

యెమెన్‌లో ఓ హత్య కేసులో దోషిగా తేలిన భారత నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల జులై 16న ఆమెకు ఉరిశిక్షను అమలు చేయనున్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కేరళలోని పాలక్కాడ్ జిల్లాకు చెందిన 37 ఏళ్ల నిమిష ప్రియ, యెమెన్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. 2017లో తలాల్ అబ్దో మెహదీ అనే యెమెన్ పౌరుడిని ఆమె హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన పాస్‌పోర్ట్‌ను తలాల్ ఇవ్వకుండా దాచిపెట్ట డంతో, దానిని తిరిగి పొందేందుకు అతడికి మత్తుమందు ఇచ్చారని కోర్టు విచారణలో తేలింది. అయితే, మత్తుమం దు మోతాదు ఎక్కు వ కావడంతో తలాల్ ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత, నిమిష తన సహోద్యోగి హనన్ సహాయంతో మృతదేహాన్ని ముక్కలుగా చేసి నీటి ట్యాంకులో పడేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ కేసులో 2018 జూన్‌లోనే స్థానిక కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించి, మరణశిక్ష విధించింది. అప్పటి నుంచి ఈ కేసుపై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ విషయంపై సంబంధిత వర్గాలు ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "నిమిష ప్రియకు మరణశిక్ష పడినప్పటి నుంచి మేం ఈ కేసును నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులు, ఆమె కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాం" అని తెలిపారు.

# మధ్యాహ్న భోజనానికి గ్యాస్ కనెక్షన్లు మంజూరు





**-రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలో అమలు**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల,**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జెడ్పిహెచ్ఎస్ లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులకు కట్టెల పొయ్యి పై ఆహార పదార్థాలు సిద్ధం చేయవద్దనిఅన్నారు. దీంతో వాతావరణ కాలుష్యం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. జిల్లాలోని 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ పై సిద్ధం చేయాలని అన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటా



**-పిల్లల పై చదువులకు, ప్రసాద్ తల్లిదండ్రుల వైద్యానికి భరోసా**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల నియోజకవర్గనికి చెందిన టీవీ9 రిపోర్టర్ గార్దాసు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ప్రసాద్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందిగా విషయం తెలుసుకున్న విప్ అది శ్రీనివాస్ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని, విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా 20 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పిల్లల పై చదువులకు అండగా ఉంటానని,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రసాద్ తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప రెడ్డి, డి.పి.ఆర్.ఓ. వి.శ్రీధర్, ప్రింట్ %డ% ఎలెక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన**

**- ప్రధానోపాధ్యాయులు భూమయ్య**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన సమావేశం నకు విద్యార్థుల తల్లి దండ్రుల నుండి అనూహ్య స్పందన వచ్చిందనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోను భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భూమయ్య మాట్లాడుతూ: తల్లి దండ్రులు మమ్ములను నమ్మి పాఠశాల కు పంపుతున్నారని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్ది, పేరెంట్స్ నమ్మకాన్ని నిలబెడుతామని అన్నారు. ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన అందిస్తామని వారి భవిష్యత్తు రూపకల్పన ధ్యేయంగా పనిచేస్తామని, అనంతరం పేరెంట్స్ తరుపున కొందరు దాతలు విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ అందజేశారు. వారికి పాఠశాల యాజమాన్యం తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అలాగే ఈ పాఠశాల నుండి బాసర ఐఐటీకి ఎంపికైన విద్యార్థిని కావ్యను ఘనంగా సన్మానించారు.

# రాజన్న, అంజన్న ఆలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**-ప్రతి మండలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తాం**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ**



అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయం, శ్రీ రాజ రాజేశ్వరస్వామి, దేవస్థానం అభివృద్దే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మార్బుల్ ఫ్లోరింగ్ పనులకి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతరమంత్రుల సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, దాదాపు 150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని అన్నారు. ఈ నెల మూడో వారంలో రూ.76 కోట్ల పనులకు టెండర్ కానున్నయని, అలాగే రోడ్డు విస్తరణ పనులు కూడా ఇటీవలే మొదలయ్యాయని అన్నారు.

వీటీడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమగ్ర ప్రణాళిక తో పనులు వేగవంతంగా సాగుతున్నాయని,రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి రానురాను పెరుగుతోందని దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు.భక్తుల సంఖ్య కనుగుణంగా ఆలయాన్ని విస్తరిస్తామని, భక్తుల రద్దీతో వేములవాడలో చిరు వ్యాపారులు, వ్యాపారులకు ఉపాధి దొరుకుతుందనిఅన్నారు. అగ్రహారం అంజన్న ఆలయంలో ఇటీవల ప్రాకారం, ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశామని అన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతోనే అంజన్న ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని,అంజన్న ఆలయ ఆవరణలో కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గం జిల్లాలోని ప్రతి మండలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ కట్టేందుకు ఆలోచిస్తున్నామని అన్నారు.ఎస్డీఎఫ్ నిధుల నుంచి ఒక్కో ఫంక్షన్ హాల్ కు రూ. 10 లక్షలు కేటాయిస్తామని మిగతా నిధులతో కలిపి వాటి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అన్నారు.

దేశ ఆధ్యాత్మిక సాంప్రదాయాన్ని కొనసాగించాలని, వేములవాడలో ఇటీవల వేద విద్యార్థులకు నాలుగు రోజులపాటు నాలుగు వేదాంశాల్లో పరీక్షలు నిర్వహించారని,ఈ పరీక్షలకు దేశంలోని ఆయా ప్రాంతాల నుంచి 160 మంది వేద విద్యార్థులు హాజరయ్యారని అన్నారు.. గతంలో ఈ పరీక్షలు తిరుమల తిరుపతి దేవస్థానం లో జరిగాయని,రాజన్న ఆలయ ఖ్యాతి దేశమంతా విస్తరిస్తోందని పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయం, అగ్రహారం అంజన్న ఆలయం అభివృద్ధికి అంతా కలిసి ముందుకు వెళ్తామని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచనల మేరకు అగ్రహారంలోని అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. మార్బుల్ ఫ్లోరింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తుల సంఖ్య కనుగుణంగా ఆలయంలో సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్. అధికారులు సుదర్శన్ రెడ్డి, ఆలయ అధికారులు శ్రీనివాస్, పురోహితులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాలయం, అంగన్వాడీ కేంద్రంలో మరమ్మత్తు పనులు



**బలగం టీవీ,తంగళ్ళపల్లి:**

తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని విద్యాలయాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో మరమ్మత్తులు, అంగన్వాడీ కేంద్రంలో స్లాబ్ నుంచి నీరు కారుతూ, పాఠశాల రెండు వరండాల్లో గోడలు లేక ఇబ్బందిపడుతున్నారని కలెక్టర్ గుర్తించారు.

**సమస్యలకు పరిష్కారం**

తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు వరండా ల్లో రూ. 22 వేలతో గోడలు నిర్మించి, ప్లాస్టరింగ్ పనులు, అలాగే బడి నేమ్ బోర్డు రిపేర్ చేయించి బిగించారు. అంగన్వాడీ కేంద్రంలో రూ. 20 వేలతో స్లాబ్ కు మరమ్మత్తు పూర్తి చేసి, ఫ్యాన్ వినియోగంలోకి తీసుకు వచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీతో తమ విద్యాలయాల్లో సమస్యలు పరిష్కారం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

**కిచెన్ షెడ్ నిర్మాణ పనులు**

వేములవాడ మండలం చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు కిచెన్ షెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. విద్యార్థులకు ఆహార పదార్థాలు ఇదే గదిలో సిద్ధం చేయనున్నారు. విద్యాలయం సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ సూచనల మేరకు వన మహోత్సవంలో మొక్కలు నాటారు.

# ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి, స్వీట్లు పంచి ఘనంగా జయంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు పులిలక్ష్మీపతి గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, సంబ లక్ష్మీరాజాం, పిట్టల రమేష్, బీ.సీ.సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనుగుల కనకయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మెరుపుల మహేష్, బాలగోని వెంకటేష్, మండల కాంగ్రెస్ నాయకులు నల్ల మోహన్, శ్రీనివాస్ రెడ్డి, కొలుపుల ప్రవీణ్, నగేష్, మైపాల్ రెడ్డి, మహేందర్, ముద్దం వెంకటేష్, గుంటి జలంధర్, యువజన కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్, దిలీప్, క్రాంతి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# రెండో ర్యాంకుకు దూసుకెళ్లిన దీప్తి






బలగం టీవీ, హైదరాబాద్

ఇటీవల ముగిసిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత విజయంలో కీక పాత్ర పోషించిన భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. ఇంగ్లండ్ పర్యటనలో తిప్పేస్తున్న ఆమె టీ20 బౌలర్ల ర్యాంకిగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లింది. గత ఆరేళ్లుగా టాప్ –10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ ఎగబాకి టాప్ 2గా నిలిచింది. అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ సదియా ఇక్బాల్‌కు, దీప్తికి 8 పాయింట్ల తేడానే ఉంది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్‌రౌండర్‌కు కెరీర్లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. పేసర్ రేణుకా సింగ్ 6లో, రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

**మూడో ర్యాంక్‌కు మంధాన**

బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ –5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తున్న మంధాన మూడో ర్యాంక్ కైవసం చేసుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉండగా ఈమధ్యే పునరాగమనం చేసిన షఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో ఉన్నారు.

# లారా రికార్డు అలాగే ఉండటం గౌరవం

- వియాన్ ముల్డర్



బలగం టీవీ, హైదరాబాద్

జింబాబ్వేతో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ అసాధారణ ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో 367 పరుగులు నాటౌట్ గా నిలిచిన ముల్డర్, అత్యధిక వ్యక్తిగత స్కోర్‌లో బ్రియాన్ లారా రికార్డు తుడిచిపెట్టే స్థాయిలో ఉన్నా, గౌరవార్థంగా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. అయితే దీనపై ఆయన స్పందించారు.

"బ్రియాన్ లారా ఒక లెజెండ్. ఆయన చేసిన 400 పరుగుల రికార్డు అలాగే ఉండటం నాకు గౌరవంగా అనిపించింది" అని ముల్డర్ స్పష్టం చేశాడు. బ్రియాన్ లారా ఓ లెజెండరీ ప్లేయర్ అని, అతను 410 రన్స్ స్కోర్ చేశాడని, ఆ స్థాయి ఆటగాడి రికార్డును అలాగే ఉంచడం గౌరవప్రదంగా ఉంటుందని ముల్డర్ తెలిపాడు. ఒకవేళ మళ్లీ 400 రన్స్ స్కోర్ చేసే ఛాన్స్ వస్తే ఇలాగే చేయనున్నట్లు చెప్పాడు. తను తీసుకున్న నిర్ణయాన్ని కోచ్ శుక్రి కాన్‌రాడ్‌కు చెప్పినట్లు తెలిపాడు. తాను కూడా అదే చెప్పాడని, ఆ రికార్డు లెజెండ్ వద్దే ఉండనివ్వు అని, నా భవిష్యత్తు ఎలా ఉంటుందో చెప్పలేం, కానీ బ్రియాన్ లారా రికార్డు ఆయన ఖాతాకే ఉంటే సరిపోతుందన్నాడు. రికార్డుల కన్నా ఆటపై, ఆటగాళ్లపై గల గౌరవాన్ని చాటుతూ తీసుకున్న ఈ నిర్ణయంపై క్రికెట్ వర్గాల్లో ప్రశంసల వెల్లువ వెలువెత్తుతోంది. రికార్డుల కన్నా ఆటపై, ఆటగాళ్లపై గల గౌరవాన్ని చాటుతూ తీసుకున్న ఈ నిర్ణయంపై క్రికెట్ వర్గాల్లో ప్రశంసల వెల్లువ వెలువెత్తుతోంది. రికార్డుల కన్నా ఆటపై, ఆటగాళ్లపై గల గౌరవాన్ని చాటుతూ తీసుకున్న ఈ నిర్ణయంపై క్రికెట్ వర్గాల్లో ప్రశంసల వెల్లువ వెలువెత్తుతోంది.

# ప్రముఖ సంగీత దర్శకుడు శివశక్తి దత్త కన్నుమూత

- కీరవాణికి తండ్రి
- రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్‌కు స్వయానా సోదరుడు
- 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు గేయ రచయిత



బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రముఖ గేయ రచయిత, స్క్రీన్ రైటర్ శివశక్తి దత్త (92) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శివశక్తి దత్త కేవలం కీరవాణి తండ్రిగానే కాకుండా, తెలుగు చిత్ర పరిశ్రమలో రచయితగా తనదైన ముద్ర వేశారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'చత్రపతి', 'సై', 'రాజన్న', 'హనుమాన్' వంటి అనేక విజయవంతమైన చిత్రాలకు ఆయన అద్భుతమైన పాటలు రాశారు. అంతేకాకుండా కొన్ని సినిమాలకు స్క్రీన్ రైటర్‌గా కూడా ఆయన సేవలు అందించారు.

ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి శివశక్తి దత్త పెద్దనాన్న అవుతారు. రాజమౌళి తండ్రి, ప్రముఖ కథా రచయిత వి. విజయేంద్ర ప్రసాద్‌కు ఈయన స్వయానా సోదరుడు. శివశక్తి దత్త మరణంతో కీరవాణి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మరణంతో టాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శివ శక్తి దత్తాకు చిత్రలేఖనంలో కూడా అసాధారణ ప్రతిభ ఉంది. ఆ మధ్య శివ శక్తి దత్తా ప్రతిభను చూసిన బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ మంత్ర ముగ్ధుడయ్యారు. 92 ఏళ్ల వయసులోనూ శివ శక్తి దత్తా ఆర్ట్ అద్భుతంగా గీసారు. స్వయంగా గీసిన దేవుళ్ల చిత్రపటాలు, శివాజీ మహారాజ్ బొమ్మతో ఆయన నివాసం ఓ దేవాలయంలా కనిపిస్తోంది. ఈ దృశ్యాలను అనుపమ్ ఖేర్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి.ఇక తన కుమారుడికి ఆస్కార్ దక్కినప్పుడు శివ శక్తి దత్తా చాలా ఆనందం వ్యక్తం చేశారు.



# వింబుల్డన్‌లో విరాట్ కోహ్లీ!

బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ వింబుల్డన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌కు హాజరై సందడి చేశాడు. తన భార్య అనుష్కశర్మతో కలిసి దిగ్గజ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ ఆడిన మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చాడు. ఈ సందర్భంగా విరాట్ కోహ్లీ సూట్–బూట్‌లో కనిపించి తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకున్నాడు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కోహ్లీ ఫోటోలలో ఆయన తన భార్య అనుష్కతో కలిసి మ్యాచ్‌ను ఆస్వాదిస్తూ కనిపించారు.

నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్‌తో తలపడ్డాడు. జకోవిచ్ ఆరంభం అంత గొప్పగా లేదు. మొదటి రౌండ్ లో 1–6తో వెనుకబడ్డాడు. అయితే ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని నాలుగు రౌండ్ల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించాడు. ఈ విజయంతో జకోవిచ్ వింబుల్డన్ 2025 క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు.

**విరాట్ కోహ్లీ స్పందన**

విరాట్ కోహ్లీ వింబుల్డన్‌లో నోవాక్ జొకోవిచ్ సాధించిన విజయంపై స్పందించాడు. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జకోవిచ్‌ను ప్రశంసిస్తూ, "ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్‌కు ఎప్పటిలాగే ఇది సులభమైన పని" అని రాసుకొచ్చాడు. విరాట్ కోహ్లీ మద్దతుకు నొవాక్ జకోవిచ్ కూడా ధన్యవాదాలు తెలిపాడు.

## ఒకప్పుడు నాకు నచ్చని స్క్రిప్ట్‌ను చెప్పలేకపోయేవాడిని

- విజయదేవరకొండ

బలగం టీవీ, హైదరాబాద్

ఒకప్పుడు తనకు నచ్చని స్క్రిప్ట్‌ను కూడా కాదనలేని పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు పూర్తి సంతృప్తి చెందితేనే సినిమా చేస్తున్నానని యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ స్పష్టం చేశారు. కెరీర్‌లో నేర్చుకున్న అనుభవాలతో స్క్రిప్ట్‌ల ఎంపికలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆయన హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన 'కింగ్‌డమ్' చిత్రం జులై 31న విడుదల కానున్న సందర్భంగా విజయ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, "గతంలో నా దగ్గరకు వచ్చిన స్క్రిప్ట్ బాగోలేదని చెప్పడానికి చొరవ ఉండేది కాదు. అదే ఇండస్ట్రీలో కుటుంబ అండ ఉన్న నా సహనటులకు ఆ వెసులుబాటు ఉంటుంది. కథ నచ్చకపోతే వెంటనే చేయనని చెప్పగలరు. కానీ ఇప్పుడు నేను కూడా ధైర్యంగా చెప్పగలుగుతున్నా. డబ్బు, దర్శకుడి కెరీర్, అభిమానులు నాపై చూపిస్తున్న ప్రేమకు గౌరవం ఇవ్వాలనే బాధ్యతతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నా. పూర్తి సంతృప్తి కలిగాకే ముందుకు వెళుతున్నా. ఇన్నేళ్లలో నేను నేర్చుకున్నది ఇదే" అని అన్నారు.

దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తన వద్దకు రెండు కథలతో రాగా, తాను 'కింగ్‌డమ్'ను ఎంచుకున్నట్లు విజయ్ తెలిపారు. రెండో కథ ఇటీవల విడుదలైన ఓ సినిమాకు దగ్గరగా ఉండటంతో, అది నైతికంగా సరైంది కాదని భావించి వదులుకున్నట్లు చెప్పారు. ఒకవేళ ఆ కథతో సినిమా తీసి ఉంటే తామే ముందుగా పూర్తి చేసేవాళ్లమని, కానీ అలా చేయడం సరికాదనిపించిందని వివరించారు. ఇక టాలీవుడ్‌లో ఒకరికొకరు సాయం చేసుకునే సంస్కృతి ఉందని, తన 'కింగ్‌డమ్' టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇవ్వమని అడగ్గానే ఎన్టీఆర్ వెంటనే అంగీకరించారని విజయ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సహకారంతోనే స్నేహబంధాలు మరింత బలపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.




## పూరి విజయ్ సేతుపతి షూటింగ్ షురూ..

బలగం టీవీ, హైదరాబాద్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, వర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి తొలిసారిగా కలిసి చేస్తున్న పాన్– ఇండియా మూవీ 'పూరిసేతుపతి'.ఈ ప్రాజెక్ట్‌ను జెబి మోషన్ పిక్చర్స్ జెబి నారాయణ్ రావు కొండ్రోల్లాతో కలిసి పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఇటీవలే లాంచ్ అయిన ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం విజయ్ సేతుపతి, సంయుక్త, ఇతర తారాగణం సభ్యులు పాల్గొనే కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎలాంటి విరామం లేకుండా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో విడుదల కానుంది.

# నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు 'ఏక్ దిన్'

**సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ**





బలగం టీవీ, హైదరాబాద్

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'ఏక్ దిన్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాతో సౌత్ స్టార్ నటి సాయి పల్లవి బాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇస్తుండగా, దర్శకుడు సునీల్ పాండే ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. సినిమా విడుదల తేదీని ప్రకటించిన చిత్రబృందం, నవంబర్ 7న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సినిమాను ఆమిర్ ఖాన్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత మన్సూర్ ఖాన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఆమిర్–మన్సూర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో, బాలీవుడ్‌లో ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో ఈ ఇద్దరి కలయికలో రూపొందిన 'జానే తూ... యా జానే నా' (2008) సినిమా సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అందుకే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.